

కె.వి.వి. బ్రహ్మానందరావు

కొద్ది గంటల క్రితం అమితమైన ఆందోళనతో విశాలను చూడాలని ట్రెయిన్ దిగుతే, ఆ ఆత్రుత, ఆందోళన తీరిపోయి ఆవేదన మాత్రం గుండెలో మిగిలిపోయింది. కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి. ఏవేవో జ్ఞాపకాలు బుర్రలో చొచ్చుకుంటున్నాయి. జ్ఞాపకాలను దూరంగా జరిగిపోవాలంటే-యీ ఊరికి దూరంగా జరిగిపోవాలి. మానవుడి మందకొడి తనానికి ప్రతీకగా ట్రెయిన్ లేటు. కారణం లేని ఆమె చావుకు ఆలోచించి, ఆలోచించి మనస్సు చాలా హైరానా పడిపోయింది.

చిన్నప్పుడు నాతోపాటు విచ్చలవిడిగా ఈ పొలాల గట్లు వెంట 'బావా! బావా' అంటూ తిరిగిన విశాల యిక మళ్ళీ జీవితంలో తారస పడదంటే ఏదో విరక్తి, వ్యక్తంగాని బాధ కల్గాయి. ప్లాట్ ఫారమ్ మీద ఫెన్సింగ్‌ను ఆనుకొని పైన ఎగురుతున్న పక్షులపంక్తి చూస్తూ నిలిచాను, గతాన్ని వర్తమానంతో ముడిపెట్టలేక.

ఎవరో నా దగ్గర వచ్చి రొప్పుతూ నిలబడ్డట్టు అనిపించింది. ప్రక్కకు తిరిగి చూసాను. మావయ్య కొడుకు 'రామం'. మొఖంనిండా పట్టిన చెమట, నిలబడే తీరు పరుగెట్టుకు వచ్చాడని చెపుతుంది. కళ్ళతో ప్రశ్నించాను. జేబులోనుండి పర్సు తీస్తూ "యింటి దగ్గర మర్చిపోయావు బావా." అన్నాడు.


మౌనంగా బండి పుచ్చుకొన్నాను.

"బండి లేటా బావా."

"అవునవును - గంట లేటు." రెండు నిమిషాలు నిలబడి "అయితే నేను వెళ్లొస్తాను బావా." వెళ్ళబోయే రామం కళ్ళలో నీరు. చిన్న కన్నీరుదైనా అవ్యక్తమైన బాధ అతని చూపులో వుంది. వెళ్ళిపోబోతున్న రామాన్ని ఆగమని సౌంజ్ఞచేసి నా చేతిలో వున్న పర్సు తీసి పది రూపాయల కాగితం యివ్వబోయాను.

"వద్దు బావా! యిప్పుడు నాకెందుకు" అంటూ వెళ్ళిపోయాడు. మనస్సు అర్ద్రిత చెందింది. రైలు పట్టాల మధ్య నడుచుకుంటూ పోతున్న రామం రెండుసార్లు వెనుదిరిగి చూసాడు. అలా చూస్తూ వెళుతుంటే, ఉన్న బంధాన్ని త్రెంపివేస్తున్నట్లు అనుబంధాన్ని త్రోసివేస్తున్నట్లు నాకు అనిపించింది. ఈ లోకపు బంధాలను త్రెంచుకున్న విశాల చావుకు నేనే కారకుడనైనట్టు అందరూ చూసే చూపులో స్పష్టంగా కనిపించింది. యిన్నాళ్ళు పెరిగిన ఆ యింటిలో పరాయి వాడిగా ఆ కొద్దిసేపూ ఫీలయ్యాను. తెలిసిగాని, తెలియకగాని ఏ తప్పు చేసినట్టు లేదు. చేసిందల్లా ఒక్కడే—పెంచి పెద్ద చేసిన మావయ్య మాట కాదనడం. అయినా దానికీ యిప్పటి సంగతికి ఏ విధమైన సంబంధం లేకపోగా అందరి కళ్ళలో వ్యక్తం అయ్యే భావన నన్ను మరీ బాధ పెట్టింది. నన్ను ఏ దృష్టిలో చూసినా నేను బాధపడను కాని చావును మనసుకి కోరుకుని వెళ్ళిపోయిన విశాల తిరిగి మాత్రం రాదు. తిరిగి రాని విశాలను ఆఖరుసారిగా చూడలేకపోయాను. నిన్న బండి దిగేటప్పటికి విశాల పరిస్థితి ఎలా వుందో తెలియదు. ఆత్రంతో యిల్లు చేరితే అప్పటి దాకా ఉంచబడ్డ విశాల గమ్యస్థానికి చేరిపోయిందని తెలిసి పిచ్చివాడిలా అచ్చటకు పరుగు పెట్టాను. విశాల శాశ్వతంగా వెళ్ళిపోతుంది. ఇప్పుడు చూడకపోతే జీవితంలో ఎన్నడూ చూడడం సాధ్యపడని మనిషిని ఆఖరుసారిగా చూడలేకపోతానన్న బాధ గుండెలో మెలి తిరిగిపోయింది. పరుగువంటి నడకతో చేరి అచట దృశ్యాన్ని చూసి నిలబడిపోయాను. జీవితపు చీకటి వెలుగులలో తోడునీడగా వెన్నంటి నడువగలనని బాసచేసి, అగ్ని సాక్షిగా కట్టుకున్న యిల్లాలి చితికి నిప్పు ముట్టించి, కట్టుకున్న దానికి హక్కును కాపాడుకుంటున్నాడు మధు.

పరిసరాలను పరికించగా కాలుతున్న కాష్ఠం మీదకంటే నా మీదే అక్కడ వాళ్ళ దృష్టి నిలిచి వుంది. వాళ్ళ దృష్టిని తప్పించుకునే ప్రయత్నంలో దూరంగా చెట్టుక్రింద నిలబడి శూన్యంలోకి చూస్తున్న మావయ్య కనిపించాడు. ఒక్క అంగలో అక్కడకు చేరాను. నన్ను చూసి "వచ్చావా! విశ్వా, విశాల వెళ్ళిపోయింది-తనకు చేసిన అన్యాయానికి కుమిలి కుమిలి ఏడ్వమని వెళ్ళిపోయింది."




అన్నాడు. అసలు అన్యాయం ఏమిటో అంతుపట్టలేదు. జ్వలిస్తున్న చితి నుండి జ్వాలలు పైకి లేస్తున్నాయి. లేచిన జ్వాలా, ఆక్రందనలా వుంది. ఆ ఆక్రందన వినక బలవంతాన చితి పేర్చినట్టు నా హృదయం ఎగిసిపడింది. మనిషిగా పుట్టి ఎన్నో కోర్కెలు అనుభవించి, అనుబంధాలను ఆత్మీయతను అందరికీ పంచి తుదకు మోహావేశాలను త్రెంచుకుని ఎవరికి చెందనట్టు, ఏమీ పట్టనట్టు వెళ్ళదీసే జీవితం వొట్టి భ్రమ. ఈ జీవి బ్రతుకు అనే మనుగడలో ఏర్పరుచుకునే బంధాలు ఒక నాటికి విచ్ఛేదం కాక తప్పదు. మనిషి ఒక మైనపు బొమ్మ. అది నీటిలో ఉంటేనే స్థిరంగా కొద్దికాలం పాటు వుంటుంది. ఈ నీరు అనే మిథ్య కరిగి పోయి జీవితం మైనపు బొమ్మలా ఎప్పుడో ఒకప్పుడు కరిగిపోక తప్పదు. ఒక అందమైన బొమ్మ పగిలిపోతే మక్కువపడ్డ పసి పిల్లాడిలా దుఃఖిస్తున్న మావయ్యను ఏలా ఊరడించాలో చేతకాలేదు. కళ్ళనిండా జారుతున్న కన్నీటి మమతను తుడిచి పెట్టడం ఎవరి తరం కాదు. చితి ముందు నిలబడ్డ మధు నన్ను చూసి వచ్చాడు. "సారీ మధూ .... యిలా జరుగు .... " పూర్తిగా చెప్పలేక నా నోరు మూగపోయింది. ముఖంలో చూడలేని నిర్లిప్తత నిర్వేదం నిండి "అంతా దైవలీల" అంటూ వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న మధువంక చూసిన మావయ్య కళ్ళలో క్రోధం, హేయభావాన్ని చూడగలిగాను. నా వంక చూసి, "విస్సూ! ఈ జీవితంలో భగవంతుడు ఎందుకో యింత నిర్దయగా శపించాడోయ్, కాకపోతే అది గుండెల్లో

చిచ్చు రగిల్చిపోతుందా, పచ్చని బ్రతుకును నాశనం చేసుకుంది. ఏమిటో వెధవ జీవితం. నేను అనుకున్నది ఎప్పుడు జరిగిందిలే. నువ్వు ఆనాడు పెళ్ళికి తల ఊపి ఉంటే నాకు ఈ నాడు యిలా జీవితాంతం ఏడ్చే బాధ తప్పిపోను. నువ్వు కాలదన్నినా దాని మనసు మాత్రం నిన్నే కలవరించింది. అందుకే ఆఖరి ఘడియల్లో నీకు టెలిగ్రామ్ యిచ్చాను. బాధపడే యోగం ఉంటే విధిలిఖితాన్ని మార్చుకోవడం మన తరం కాదు." మాటల్లో నిష్పూంత, నిరాశ, నిబిడీకృతమైన వేదన. ఏం మాట్లాడాలో, ఏలా మాట్లాడాలో అర్థంకాని అయోమయ పరిస్థితి. యిద్దరి నడుమ నిశ్శబ్దం నిలబడింది. చితిపూర్తిగా కాలకముందే విశాలతో ఉన్న అన్ని బంధాలను పూర్తిగా త్రెంపేసుకుని ఇంటికి బయలుదేరాం. ఊహ తెలియని వయస్సులో విశాలతో ఆడిన ఆటలు, ఒకే యింటిలో పుట్టి పెరిగిన అనుబంధం, ఆత్మీయత మనస్సులో ముళ్లులా గ్రుచ్చుకుంటోంది. తిరిగి గుమ్మంలో కాలుపెట్టే సరికి అత్తయ్య బావురుమంది. "ఆనాడు కూతురును కాదన్నాడు - మళ్ళీ ఈ రోజు కళ్ళ నీరు తుడవటానికి వచ్చినట్టున్నాడు" ఎవరు ఉన్నారో గమనించే స్థితిలో లేను. ఆ యింటి వాతావరణం పాతదే అయినా అప్పటి పరిస్థితి మాత్రం కొత్తగా వుంది. ఓ మూల కూర్చుని మౌనంగా బాధపడే మావయ్య. ఒక ప్రక్క అత్తయ్య ఏడుపు చూడవచ్చిన వారి పరామర్శలు చూచే సరికి శరీరంలో వణుకు ప్రారంభమైంది. ఆ స్థితిలో, ఆ క్షణంలో వెళ్ళిపోవాలనుకుంటే - ఆ పరిస్థితిలో అంత సబబు గాదనిపించింది. ఉద్యోగరీత్యా మరునాడు వెళ్ళక తప్పలేదు. వీధి చివరిదాకా సాగనంపడానికి వచ్చిన మావయ్య 'యిన్నాళ్ళు నువ్వులేకపోయినా అది వుండేదని సరిపెట్టుకునే వాళ్ళం. అది పోయింది. ఆ ఆశా తీరిపోయింది. నువ్వు దూరంగా వెళ్ళిపోతున్నావు మా రెండు జీవితాలకు యిక ప్రశాంతి లేదు. అప్పుడప్పుడయినా రావడానికి ప్రయత్నించు" మాటల్లో పొర్లుకొస్తున్న కన్నీరు ఉంది. నేను బయలుదేరేటప్పటికి మధు ఎక్కడా కనిపించలేదు. మావయ్యను అడిగాను, "ఎవరికి తెలుసు .... కట్టుకున్న దానిని ఆలనా పాలనా చూడకుండా విలాసాలతోనే దాని జీవితాన్ని నాశనం చేశాడు. కర్మ కాలి యిలాంటి వాడు దొరికాడు." అలా మధు మీద అంత అభాండం వెయ్యడం నాకు నచ్చలేదు. సెలవు తీసుకుని స్టేషన్‌వైపు నడిచాను. ఆలోచిస్తూ నడుస్తున్నాను 'విశాల చావే' విస్మయంగా తోచింది. విశాల చావుకు నా బాధ్యత ఏమైనా వుందా - అనే ఆత్మ పరిశీలనలో గతం గుర్తురాక తప్పలేదు. ఒకరోజు భోజనాల దగ్గిర "5 ఐ బ్బు వచ్చాయి కదూ ముహూర్తం పెట్టించేస్తాను" అన్నాడు మావయ్య.




వడ్డిస్తున్న అత్తయ్యా, తింటున్న మావయ్యకూడా నా నుండి వెలువడే సమాధానానికి ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. యింత హఠాత్తుగా ఈ ప్రస్తావన ఎప్పుడో ఒకప్పుడు వస్తుందని తెలుసు. తెలుసుండికూడా ఏం చెప్పాలో ఎన్నడూ ఊహించలేదు. దానికి కారణం యిటువంటి ప్రస్తావన ముఖా ముఖి రావడం యిదే ప్రథమం కనుక. నిమిషాలు కదులుతున్నాయి. కంచంలో నా చేయి కదల లేదు.

"ఏం అంటావు" ఇక చెప్పక తప్పదనిపించి "నాకు యిప్పట్లో వివాహ ప్రసక్తి లేదు. జీవితంలో ఏం తక్కువో తెలియదు-కాని ఏదో ఉంటే బాగుండుననే తపన వుంది. నా వయస్సులో వుండే అనురక్తిపోయి విరక్తి భావం ఏర్పడింది. అది ఒక పట్టాన పోదు. మీదుమిక్కిలి వివాలను నేను ఆ దృష్టితో....చూ ...డ ...లే....దు". నా మాటలు వింటూనే అత్తయ్య ఈసడింపుగా గదిలోంచి వెళ్ళిపోయింది. ఎప్పటినుండో కిటికీ దగ్గర

నిలబడ్డ విశాలను అప్పుడే చూశాను. నా చూపును తప్పించుకుంది. బిడ్డలా పెంచినందుకు వాళ్ళ కోరికను మన్నించి, నేను ఏర్పరుచుకున్న పరిధి దాటి ఈవలకు రాలేకపోయాను. నన్ను పెంచడంలో ఏమైనా కొద్దో గొప్పో స్వార్థం ఉంది ఉంటే అది ఈ విషయంలోనే కావచ్చు. ఒకవేళ ప్రేమ అలాంటిది కాకపోయినా ఎదిగిన పిల్ల అందుబాటులో వుండడంవల్ల అలాంటి తలంపు కల్గడం అతి సహజం. విశాల అంటే ప్రేమ, అభిమానం వున్నాయి కాని ఆ పవిత్రతను అపవిత్రం చేయలేను. వాళ్లు ఎప్పటినుండో అనుకొని వుండవచ్చు, అలా అనుకుని వున్న ఈ విషయాన్ని నేను కాదు పొమ్మంటే వాళ్ళ మనస్సు పడే ఆవేదన భరింపరానిదే. బాధతో ఆలోచనతో నా గదిలోకి వచ్చి కళ్లు మూసాను. గదిలో వెలిగిన లైటుకు కళ్లు చిట్లించి చూడగా ఎదురుగా మంచినీళ్ళ గ్లాసుతో నిలబడ్డ విశాల కనిపించింది. ఆమె వంక చూడాలంటే ఎప్పుడూ లేని భయం గుండెలో ఆవరించి ఏదో నిస్సత్తువ వొంటి నిండా నిండుకుంది. చేతిలో గ్లాసును బల్లమీదపెట్టి నిలబడింది. నిలబడ్డ విశాల ముఖం తెల్లగాపాలిపోయింది. ఆమె అలా నించోవడం ఏదో చెప్తుందనే భ్రాంతిని కల్గించింది. కాని ఏమీ చెప్పలేదు. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ — "క్షమించగలవా" అన్నాను. ఆ అర్థింపు అసమంజసంగా నాకే తోచింది. "ఎందుకు—బావా నన్ను క్షమించడం" అంటుందేమోనని ఆశగా చూసాను. అలా అనలేదు, అసలు పెదవే కదల్చలేదు. కాలం ఎంత భయంకరమైందో అప్పుడు అర్థమైంది. గదిలో ఉన్న యిద్దరు మనుష్యుల అంతరంగాలలో మాటలు కొల్లలు. అవి పెదవి దాటి మాత్రం బయటకు రాలేవు. ఇంకా భయపెడుతున్న నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ "నేను రేపు విశాఖపట్నం వెళ్తున్నాను అక్కడ నా స్నేహితుడు ఉద్యోగం చూస్తానంటే..."

"ఏం బావా! భయపడి పారిపోతున్నావా". ఆ మాటలు గుండెల్లో గ్రుచ్చుకొన్నాయి. ఆ మాటకు సరైన సమాధానం ఉన్నట్లు అన్పించక ఏం చెప్పలేక-ఏదో చెప్పాలనే తపనలో "నువ్వు ఎలా అనుకున్నాసరే! ఏలా ఊహించినా సరే....కాని... ఒకటి మాత్రం గుర్తు చేయాలి. నిన్ను నాకిచ్చి కట్టపెడతారనే భయంవల్లమాత్రం కాదు. చిన్నప్పటినుండి నాతో పెరిగిన నీ స్నేహం నేను మరువలేను. అదివాక తీయని అనుబంధం ఆ బంధం స్నేహబంధంగా కలకాలం నా గుండెలో నిలిచిపోతుంది. నీ జీవితంలో పెనవేసుకున్న ఈ స్నేహ లతను కించపరచేలా ప్రవర్తించి వుంటే నన్ను క్షమించు. ఇంకో మాట వింటానంటే నాకు తెలియని విరక్తి నన్ను ఆవరించి ఈ సంసార సుఖాలకు అతీతంగా బ్రతికేయాలనే వాంఛ నాకెందుకో మనస్సులో

నాటుకొనిపోయింది. ఈ వైరాగ్యం, ఈ వేసులుబాటు జీవితం వెనక కొద్దో గొప్పో ఆధ్యాత్మిక చింతన వుందేమోనని అనుమానం యిప్పుడిప్పుడే కల్గుతుంది. ఎందుకో తెలియని జీవితంలో ఏదో పరమార్థం అన్వేషించాలనే వెర్రి తపనలో వుండి నీ అందమైన జీవితాన్ని నా పిచ్చి ఆలోచనలకు ఎరగా వాడుకోలేను, నీ కంటికి నచ్చిన వాడిని నువ్వు....' చెప్తూ విశాలవంక చూసాను. కళ్ళనిండా నిండుతున్న కన్నీరు చెంపలమీద ధారాపాతంగా కారుతుంది. కారే కన్నీటిని ఆపుకోలేకో, లేక నా నుంచి దూరంగా జరిగిపోవాలనే సంకల్పంతోనో గది దాటి వెళ్ళింది. ఆమె మనస్సు పడే బాధను తలచుకుంటే హృదయం జాలితో నిండిపోయింది, నన్ను నేను పరిశోధించుకుంటే నావల్ల తప్పు లేదనిపించింది. ఆ కాస్సేపు క్షోభతో సతమతమైన మనస్సు ఉదయం నిద్రలేచేటప్పటికి కాస్త కుదుట పడింది. ఉదయం లేవగానే మావయ్యకు నా నిర్ణయం చెప్పాను. నేను అనుకున్నంత ఆశ్చర్య పడకపోవడం నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. సామాన్యంగా అంతుపట్టని మనస్తత్వంగల మావయ్య ఏ కాస్త బాధ పడినా పైకి వ్యక్తం కానీయడు. ఒక రకంగా చెప్పాలంటే సంపకాలు పంచే కొట్టు అయినా మనస్తత్వం. ఇంత మంచి మనుష్యులకు దూరంగా పారిపోవడానికి ప్రయత్నించే నా సంకుచిత మనస్తత్వం నాకే బోధపడని స్థితి అప్పటిది. వచ్చే ముందు విశాల గురించి ప్రత్యేకంగా చూడగా వెనక వరండాలో శూన్యంలోకి చూస్తూ కూర్చుంది. ఆ కళ్ళలోని దైన్యాన్ని దీనత్వాన్ని చూసి పలకరించడానికి భయం వేసింది ఎదురుగా నుంచున్న నన్ను చూసి నావైపు తిప్పింది. ఆ చూపులో జాలి, ప్రేమ, అనురాగం అంతకన్నా నిస్సహాయత నిండి వున్నాయి. ఏదో భయంకరమైన సుడిగుండాలలో బలవంతంగా త్రోయబడే మనిషి రక్షించమని అర్థించే చూపులా వుంది. చూపుకు తట్టుకుంటూ, శక్తిని అంతా కూడదీసుకొని "వెళ్తాను విశాలా"





అని చెప్పగలిగాను.

"ఊ...." ఆ స్వరం ఎక్కడనుంచి వచ్చిందో తెలీదు. కానీ అది అసమ్మతో, సమ్మతో అంతకన్నా తెలియదు. ఏదీ అర్థం కాకుండానే వెనుదిరగబోతూ 'బావా' అన్న విశాల పిలుపు విని ఆగాను.

"అంతమైన మనుష్యం – మనసులు ఇంత వక్రంగా ఎందుకు ఉంటాయో అర్థం కాదు నాకు. నీ నీడలో కలకాలం నిలిచి పోదామనుకుంటే నువ్వు నా నీడ అంటేనే భయపడి పారిపోతున్నావు. కన్నెగా నేను కన్న కలలు నా కళ్లముందే కడతేరి పోయాయి. ఒక ఆడదాని మనస్సు ఇన్నాళ్ళు నువ్వు అర్థం చేసుకోలేదంటే నీ తప్పుకాదు అది కేవలం నా ఖర్మ. నా మనస్సులో మొగ్గగా నీ రూపం పెరిగిన నాడే నువ్వు దాన్ని త్రుంచి వేయవలసింది. ఈనాడు వున్న బంధాన్ని త్రెంచివేసిపోతూ ఈ శోభను, చిమ్మను నా పరంచేసిపోతున్నావు! వెళ్ళు బావా! వెళ్లు. కనీసం అప్పుడప్పుడు రాలేకపోయినా ఉత్తరాలైనా వ్రాస్తూ వుండు" అన్న విశాల మాటలు చురకల్లా తగిలాయి. విశాఖపట్నం చేరుకున్న అనతికాలంలోనే ఉద్యోగం దొరకడంతో కొంతవరకు మనస్సులో చెలరేగే సంఘర్షణను మరచిపోయాననే చెప్పాలి. ఆ తర్వాత నెలకే విశాల పెళ్ళిపీటలమీద కూర్చుంది. అందగాడు, స్థితిపరుడు, మధును చూసిన తరువాత విశాలకు తగినవాడే అనిపించింది. మధు అన్ని విధాల విశాలను సుఖపెట్టగలడనే భావము కలిగింది. అతని ప్రక్క ఏమీ పట్టనట్టు తనకేమీ సంబంధం లేనట్టు తలవంచుకున్న విశాల మొఖంలో అలసత్వభావం తొణికిసలాడి, ఆశలను వాంఛలను అమ్ముకున్న మనిషిలా నిరుత్సాహం, నిర్లిప్తతా, నిలువునా నింపుకుని నిలబడి వుంది. పెళ్ళికూతురులో ఉండవలసిన ఉత్తేజం, ఉత్సాహం రవ్వంతలేదు. నునుసిగ్గు దొంతరులలో తాళి కట్టిన భర్త చేష్టలను క్రీగంట గమనించి పులకించి పోయే కొత్త పెళ్ళికూతురు ఛాయ అంతకన్నాలేదు. రెండు మూడుసార్లు తల ఎత్తిన విశాల, నన్ను చూసి ఇష్టం లేనట్టుగా మొఖాన్ని దించేసుకుంది. ఆమె చూసిన చూపులోని అయిష్టతకు మనస్సులో ఏదో ప్రేరణ జరిగి కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాను. మావయ్య బలవంతంమీద ఆ నాలుగు రోజులు ఉండక తప్పలేదు.

మళ్ళీ ఇంతలోనే వూహించని పరిస్థితులలో రావడం, వచ్చి విశాల కనిపించక, ఇంకెప్పుడూ కనిపించని చోటుకు వెళ్ళిపోయిందన్న కఠోర సత్యాన్ని ఎదుర్కొనవలసి రావడం జరిగింది. తాను చచ్చి సాధించింది ఏమిటో అర్థంకాకపోగా అసలు చావుకు కారణం బోధపడలేదు. విశాల చావుకు కారణం పెళ్ళిచేసి తన బాధ్యతను నిర్వర్తించిన మావయ్యా? తాళికట్టి తన దానిగా చేసుకున్న మధా? మావయ్య మనసుపోవడానికి అంతకారణం కనిపించదేమో. ఒక వేళ మధు అయితే?




ఏమోకావచ్చు. భార్య పట్ల సరైన ఆదరణ చూపించక-భార్యాభర్తల మధ్య చెలరేగే వివాదం చిలికి చిలికి గాలి వాన అయి ఒక నిండు ప్రాణం బలి తీసుకోడానికి ప్రేరేపించి ఉండవచ్చు. నా ఊహకు అందింది సరైనదే అనిపించి, మధు అంటే మంచి అభిప్రాయం సడలి ఒక న్యూనత భావం ఏర్పడింది. దానికి తగ్గట్టుగా సిన్న మావయ్య అన్న మాటల్లోని భావం మరింత నా ఊహను ధృఢపరిచి, మధే పూర్తిగా, స్పష్టంగా, సహేతుకంగా విశాల చావుకు కారకుడని నిర్ణయం చేసేసాను. తెగని ఆలోచనలు ప్లాట్ ఫారమ్ మీద ట్రయిన్ రాకతో విలిచిపోయాయి. కదులుతున్న ట్రెయిన్‌లో కూర్చుని ఈపొలాలు-పొలాల మధ్య నున్న దేవతల గుళ్ళు మళ్ళీ ఎప్పటికి చూస్తానో అనే తలంపు కల్గగానే గుండె అరల్లో పొర్లుకొన్న [illegible]ప్పటికి కళ్ళు చెమర్చాయి. ట్రెయిన్ అప్పుడే గేటు దాటి వచ్చింది, గేటు ప్రక్కనేవున్న శ్మశానంలో అందాలన్నీ త్రెంచుకుపోయిన విశాల శేషాలు కడసారి చూడాలనే తలంపు కల్గి కళ్ళతో నిన్నటి ప్రదేశాన్ని వెదుకుతే అక్కడ దృశ్యంచూసి క్షణంపాటు నివ్వెరపోయాను. నిన్నటి ప్రదేశంలో మిగిలివున్న చితా భస్మంముందు మోకరిల్లి హస్తాలతో నిలబడ్డ మధు నా కంటికి నలుపులా మెదిలాడు. అతనిగురించి నేనుఅనుకున్నది పొరపాటు అని గ్రహించడానికి ఆదృశ్యం చాలు. అయితే విశాల చావుకు కారణం మావయ్య కాదు మధు కాదనుకున్నా కాదు. యిక మిగిలింది నేనే ఏమో [illegible] ప్రశ్న గానే మిగిలిపోయింది.

❋